సాక్షి చిత్తూరు
గురువారం । 27 । జూలై । 2023



ప్రగతి మణిహారం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లాలో ఎంపిక చేసిన రాష్ట్ర హైవేలు, మేజర్ డ్రిస్టిక్ రోడ్లను అభివృద్ధి, మరమ్మతు చేయనున్నారు. - 8లో



సీఎం జగన్‌కు భారతరత్న ఇవ్వాలి

పేదల తలరాత మార్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కోరారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	25
తిరుపతి	31	24
తిరుమల	28	21
గూడూరు	33	27
నగరి	34	26

న్యూస్‌రీల్

త్వరలో ఆర్సీలు, లైసెన్స్ కార్డులు

చిత్తూరు రూరల్: కొత్త వాహనాల ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డు(స్మార్ట్)లను ప్రభుత్వం త్వరలో అందించనున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బడ్జెట్ కేటాయింపుతో ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. టెండర్లు పూర్తి కాగానే ఆర్సీలు, లైసెన్స్ కార్డులు రానున్నాయని ఆయన పేర్కొన్నారు.

31లోపు ఈకేవైసీ చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని చిత్తూరు సబ్‌ట్రెజరీ అధికారి నరేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు సబ్‌ట్రెజరీ పరిధిలో సర్వీసు, ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, ఆధార్ నంబర్‌తో ఈకేవైసీ అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



శాంతిపురంలో ప్రసంగిస్తున్న జేసీ శ్రీనివాసులు

శాంతిపురం/వి.కోట/రామకుప్పం: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు చెప్పారు. శాంతిపురం,వి.కోట, రామకుప్పంలో బుధవారం ఆయన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, వ్యవసాయశాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పాలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాడి రైతులు లాభపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా సహకార సంస్థ సౌజన్యంతో ఇటీవల అమూల్ డెయిరీని ప్రారంభించారని చెప్పారు. జిల్లాలో అమూల్ డెయిరీ వచ్చాక ఆరు దఫాలు పాల ధరలను పెంచారని తెలిపారు. పాల ఉత్పత్తిని, అమూల్ డెయిరీకి పాల సేకరణ పెరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. అమూల్ డెయిరీకి పాలను విక్రయించేలా పంచాయతీ కార్యదర్శులు, గోపాలమిత్రలు, వలంటీర్లు సమన్వయంగా పనిచేసి, రైతులను చైతన్యపరచాలని చెప్పారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మూడు రోజుల్లోపు ఆవులు ఉన్న రైతుల వివరాలను రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో లబ్ధి పొందిన వారు పాడి ఆవులను కొనుగోలు చేసి తమ ఆదాయం పెంచుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్, ఆర్డీఓ శివయ్య, డీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ హేమమాలిని పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి



అతిసారవ్యాధిగ్రస్తుడిని పరామర్శిస్తున్న జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి

తవణంపల్లె: కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. బుధవారం తవణంపల్లె పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో టీబీ శాంపిళ్ల సేకరణ, టీబీ పరీక్షలు ఎలా చేస్తున్నారని, గర్భిణులకు పరీక్షలు ఎలా చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీహెచ్ సర్వేపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో డెలివరీ కేసుల సంఖ్య పెంచాలని డాక్టర్‌ను ఆదేశించారు. టీబీ కేసులను గుర్తించి శాంపిళ్ల పంపాలని సూచించారు. కార్యక్రమంలో తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భారతి, డీపీఎంటలు మణి, ఎల్‌టీ శేఖర్, స్టాఫ్ నర్సు శ్రీదేవి, హెచ్‌ఏ సుబ్రమణ్యం రెడ్డి, సూపర్‌వైజర్లు నిర్మలమ్మ, శ్రీహరి పాల్గొన్నారు.

రేపటి నుంచి చతుర్వేద హవనం

తిరుమల : ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు వారణాశిలో శ్రీ శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహించనున్నారు. లోక కల్యాణార్థం ఏడు రోజుల పాటు నాలుగు వేదాలను పఠించి, యజ్ఞేశ్వరునికి సమర్పణ చేయనున్నారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ విభీషణ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కనుపాపకు రక్షణ



నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో తలెత్తే కంటి సమస్యలను ఆదిలోనే అరికట్టేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం.. ఆర్థిక ఇబ్బందులు.. పౌష్టికాహార లోపం తదితర కారణాలతో పిల్లల భవిష్యత్తు అంధకారం కాకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా బాల భవిత కేంద్రాల ద్వారా రెటీనా పరీక్షలు చేయిస్తోంది. తొలి దశలోనే లోపాలను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తోంది. పసిపాపలను కనురెప్పలా కాపాడుకుంటోంది.

- చిన్నారుల కంటికి రెప్పలా బాల భవిత కేంద్రాలు
- హైరిస్క్ నవజాత శిశువులకు విధిగా రెటీనా పరీక్షలు
- ప్రతి నెలా రెండు పర్యాయాలు ప్రత్యేక శిబిరాలు
- పిల్లల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా చర్యలు
- గుర్తించిన బాధితులకు మెరుగైన చికిత్సలు



చిత్తూరు బాల భవిత కేంద్రంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సాక్షి తిరుపతి డెస్క్ : ఆరోగ్య సమాజానికి ఆదిలోనే అవరోధం ఎదురవుతోంది. బాల్యంలోనే చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రక్తహీనత.. దృష్టిలోపం.. నరాల బలహీనత వంటి సమస్యలు వారిని వేధిస్తున్నాయి. ఇవన్నీ నవజాత శిశువుల కంటిపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగుల వేస్తోంది.

బాలలకు 'భవిత'

ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతిలో బాల భవిత కేంద్రాలున్నాయి. పిల్లల్లో శారీరక, మానసిక వైకల్య నివారణే లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రధానంగా నవజాత శిశువుల్లో కంటికి సంబంధించిన సమస్యను తొలిదశలోనే గుర్తించి అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతి నెలా రెండు రోజులపాటు ప్రత్యేకంగా రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీకి పరీక్షలను ఆయా కేంద్రాల్లో చేయిస్తున్నారు. వీటి ఆధారంగా లోపాలను గుర్తించి చిన్నారులను కాపాడేందుకు చర్యలు చేపడుతున్నారు.

రక్తనాళాల ఎదుగుదలతోనే..

రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ (ఆర్‌ఓపీ) అనేది ప్రీమెచ్యూర్ శిశువు కంటిలో రక్తనాళాలు అసాధారణ ఎదుగుదల కారణంగా సంభవిస్తుంది. పిండం అభివృద్ధి చెందే సమయంలో రెటీనా మధ్యభాగం నుంచి రక్తనాళాలు వృద్ధి చెందుతాయి. ఈ ప్రక్రియ సాధారణ ప్రసవానికి కొన్ని వారాల ముందు పూర్తవుతుంది. అయితే నెలలు నిండని శిశువులలో ఇది అసంపూర్ణంగా ఉంటుంది. రక్తనాళాలు సాధారణంగా పెరిగితే ఆర్‌ఓపీ జరగదు. దీనికి విరుద్ధంగా, ఒకవేళ నాళాలు పెరగడం అసాధారణంగా ఉన్నట్లయితే ఆర్‌ఓపీ వచ్చే అవకాశాలు ఉంటాయి.

ప్రతి నెలా రెటీనా పరీక్షలు

నవజాత శిశువుల్లో వచ్చే కంటి సమస్యలను నివారించేందుకు బాలల భవిత కేంద్రంలో ప్రతి నెలా రెండు పర్యాయాలు రెటీనా పరీక్షల నిర్వహణకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతి క్యాంపునకు 70 మందికిపైగా వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటున్నారు. వీరిలో ఆర్‌ఓపీ తేలితే వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నారు. గత ఏడేళ్లలో ఈ కేంద్రాల ద్వారా 3,576 మందికి కార్పొరేట్ ఆస్పత్రుల సాయంతో రెటీనా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 128 మందిలో ఆర్‌ఓపీ సమస్యను గుర్తించి చికిత్స అందించారు. శస్త్రచికిత్స అవసరమైతే ఉచితంగా చేయించే బాధ్యతను భవిత కేంద్రం నిర్వాహకులు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఆర్‌ఓపీ స్క్రీనింగ్ పరీక్షల వివరాలు

సంవత్సరం	చిత్తూరు	తిరుపతి	గుర్తించిన బాధితుల సంఖ్య
2017	307	198	17
2018	194	167	21
2019	323	227	20
2020	169	232	10
2021	210	324	23
2022	300	424	35
2023	273	274	7



చిత్తూరు బాల భవిత కేంద్రంలో పురిటిబిడ్డలతో తల్లులు

ఆర్‌ఓపీకి ఇవీ కారణాలు..

- పుట్టిన బిడ్డ 900 గ్రాముల కంటే తక్కువ బరువు ఉంటే...
- నెలలు నిండకుండా శిశువు జన్మించడం
- పుట్టిన సమయంలో ఏడవకపోవడం
- ఎస్‌ఎన్‌సీయూలో చికిత్స అందించిన పిల్లలకు..
- వంశంపారంపర్యంగా కంటి సమస్యలు ఉంటే..

ఈ క్రమంలో రెటినల్ పరీక్షను శిశువు పుట్టిన 30 రోజుల లోపు చేయించుకోవాలి.

చికిత్స ఇలా..

లేజర్ చికిత్స, యాంటీ వీఈజీఎఫ్ ఇంజెక్షన్లు, శస్త్రచికిత్స ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. ఆర్‌ఓపీ తీవ్రమైతే స్టేజ్ 3 వరకు వైద్య చికిత్స అవసరం. వ్యాధి 4 లేదా 5 దశకు చేరుకున్న తర్వాత శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఒక్కసారి చికిత్స తీసుకుంటే ఏటా తప్పనిసరిగా చెకప్ చేయించుకోవాలి. నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు ఆర్‌ఓపీ సమస్య ఉంటే ఐదేళ్లు వచ్చే వరకు తగిన చికిత్స అందించడం ఉత్తమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం చేస్తే...

- చూపు మందగించడం
- మెల్ల కన్ను
- రెటీనల్ డిటాచ్‌మెంట్ గ్లకోమా
- అంబ్లయోపియాతో పాటు చూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదముంటుంది.

ఉచితంగా సేవలు



పుట్టిన బిడ్డ విషయంలో అలసత్వం ఉండకూడదు. లోపాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగిన చికిత్స చేయించుకోవాలి. పుట్టిన బిడ్డలో కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు చేపడతున్నాం. రెటీనా స్క్రీనింగ్ పరీక్షలు చేయించి, అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయిస్తున్నాం. భవిత కేంద్రం ద్వారా ఉచితంగా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– గుణశేఖర్, జిల్లా బాల భవిత కేంద్రం, మేనేజర్, తిరుపతి

ముందు చూపు అవసరం



పుట్టిన బిడ్డ విషయంలో తల్లిదండ్రులకు ముందు చూపు అవసరం. విధిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా హైరిస్క్ ఉన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు వహించాలి. తల్లిలోని లోపాలు, వంశపారం పర్యంగా వచ్చే కొన్ని కారణాల వల్ల పుట్టిన బిడ్డల్లో కంటిచూపు మందగించే అవకాశాలు ఉంటాయి. ఇందుకోసం బాల భవిత కేంద్రంలో రెటీనా పరీక్షలు చేయిస్తున్నాం. ఇక్కడ అన్ని సేవలను ఉచితంగానే పొందవచ్చు.

– దుర్గా ప్రసాద్, చిన్నపిల్లల వైద్యుడు, జిల్లా బాల భవిత కేంద్రం, చిత్తూరు

కుప్పం చరిత్రను తిరగరాద్దాం

- ఎన్నేళ్లు బాబును భరిస్తారు!
- ఆలోచించి..ఆదరించండి..
- దొంగ ఓట్ల ఏరివేతను మేమూ ఆహ్వానిస్తాం
- పీఏల పాలనకు స్వస్తి పలకండి
- కుప్పం పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మల్లానూరు సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: 'ఎన్నిల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారు. రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత కలిగిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే. ఈ నేపథ్యంలో కుప్పం చరిత్రను తిరగరాసేందుకు ప్రజలు ఏకం కావాలి.' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెండుగంపల్లి, నడుమూరు, వసనాడు, మంకలదొడ్డి, మల్లానూరు, టీ సదుమూరు, మెట్లచేను, పైపాళెం పంచాయతీల్లో మంత్రి పర్యటించి, ప్రసంగించారు. ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి జనాలను మోసం చేసిన చంద్రబాబుకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నవరత్నాలు ద్వారా నాలుగున్నర ఏళ్లలోనే పూర్తి చేశారన్నారు. కొత్త రాజకీయాలకు తెరదీశామని, ప్రతి పంచాయతీకి వెళుతున్నామని..గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి చేరాలనే ఉద్దేశంతోనే సచివాలయాలు ఏర్పాటు చేసి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కరోనా పరిస్థితుల్లో రాష్ట్రాలు, దేశాలు అతలాకుతలం అయితే, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం వైద్యాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ప్రజలకు అన్ని విధాల సేవలు అందించారని తెలిపారు. ఇదే సమయంలో జాబ్ క్యాలెండర్ ఇచ్చిన మేరకు సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వారి అభిమానం పొందారని చెప్పారు. కుల,మత, పార్టీలకతీతంగా పేదరికమే ప్రమాణికంగా అర్హులైనా ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమం అందివ్వాలన్న లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షలు ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 6 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. ఎన్నికలలోపు 24 లక్షల ఇళ్లు పూర్తి చేసి, పేదవాడి సొంతింటి కల నేరువేరుస్తామన్నారు.



సభకు హాజరైన జనం

ఎన్ని ఏళ్లు బాబును భరిస్తారు!

7 సార్లు 35 ఏళ్లు చంద్రబాబుకు ఓట్లు వేసి గెలిపించారు. ఇంకా ఎన్ని ఏళ్లు మోసపూరిత చంద్రబాబును భరిస్తారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నా సొంత నియోజక వర్గానికి ఏమి చేశారో ఆలోచించండని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. కుప్పానికి సాగు, తాగునీరు కోసం ఒక ప్రాజెక్టు కట్టారా? లేక యువత కోసం పరిశ్రమలు స్థాపించారా? అని ఆలోచించాలన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 90 శాతం పూర్తి అయిన హంద్రీనీవా కాలువ మిగిలిన పనులు పూర్తి చేసి, కుప్పానికి నీళ్లు తీసుకుని రాలేపోయారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి కుప్పం పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించి, కుప్పం పట్టణానికి నీరు తీసుకుని వస్తామన్నారు. అభివృద్ధి పనులు పక్కన పెట్టి, చంద్రబాబు తిట్ల పురాణం ఎత్తుకున్నారని, ఎప్పుడూ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీని తిట్టమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. చంద్రబాబును గెలిపిస్తే కుప్పం ప్రజలకు ఏమి చేయరని, ఆయన పీఏల పెత్తనంతో ప్రజలు నలిగిపోతున్నారని చెప్పారు. ఈ పీఏల వ్యవస్థకు స్వస్తి పలికాలని సూచించారు. వైఎస్సార్ సీపీని ఆదరిస్తే యువ నాయకులు భరత్ అందరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఊతం

- నేడు జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమం
- జిల్లాలో 13 మంది విద్యార్థులకు లబ్ధి
- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థులు విదేశాల్లో నాణ్యమైన విద్యనభ్యసించేందుకు వైఎస్సార్ సీపీ సర్కారు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులు విదేశీ చదువులు చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వరల్డ్ క్యూఎస్ ర్యాంకింగ్, టైమ్స్ ర్యాంకుల ప్రకారం ఇంజినీరింగ్, మెడిసిన్, లా, జర్నలిజం తదితర కోర్సులు చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, ఇతర విద్యార్థులకు రూ.కోటి వరకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, విమాన ప్రయాణం, వీసా ఖర్చులతో సహా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ పథకం ద్వారా ప్రపంచంలోని 320కి పైగా ఉత్తమ కళాశాలల్లో ఉచితంగా చదువుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.

జిల్లాలో 13 మందికి లబ్ధి

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా జిల్లాలోని 13 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. 2022–23 సంవత్సరంలో 11 మందికి, 2023–24లో ఇద్దరికి మొత్తం 13 మందికి లబ్ధి కలుగుతోంది. గత విద్యాసంవత్సరంలో 11 మంది విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరు విదేశాలకు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం రూ.2,19,82,841 నగదును ప్రభుత్వం ఈ నెల 27వ తేదీన సంబంధిత అభ్యర్థుల ఖాతాలకు జమ చేయనుంది.

నేడు కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం

జగనన్న విదేశీ విద్యాదీవెన (మొదటి విడత) కార్యక్రమం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీచైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా స్థాయి కార్యక్రమానికి విచ్చేయాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు ఆహ్వానం పంపారు.

పేదల కల సాకారం



విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద విద్యార్థుల కలను ప్రభుత్వం సాకారం చేస్తోంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా విదేశాల్లో విద్యనభ్యసించలేని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా మేలు చేస్తోంది. పేద విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా 320కి పైగా ఉత్తమ కళాశాలల్లో చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 27వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో రూ.2,19,82,841 నగదు లబ్ధిదారులకు ప్రభుత్వం అందివ్వనుంది.

– షణ్మోహన్, కలెక్టర్

ధైర్యవంతులను ఎన్నటికీ మరువలేం

- కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



కార్గిల్ విజయ దివస్ ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు

చిత్తూరు కలెక్టరేట్ : కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న యుద్ధవీరుల ధైర్య, సాహసాలను ఎప్పటికీ మరువలేమని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి విజయ శంకర్‌రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలో మౌనప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ, నేవీ, వైమానిక దళాల యుద్ధ వీరులకు నివాళులర్పించారు. సైనిక సంక్షేమ శాఖాధికారి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పళని, ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం 60 రోజులకు పైగా జరిగిందన్నారు. పాకిస్తాన్ సైనికులపై భారత్ సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఏటా జూలై 26న కార్గిల్ విజయ దివస్‌ను నిర్వహించుకుంటామన్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జిల్లావాసులు కెప్టెన్ పి.మురళి, ఆర్‌హెచ్‌ఎం సుధాకర్, సిపాయి వినాయకరెడ్డికి శాలువలు కప్పి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ సంఘం మాజీ నాయకులు రామచంద్ర, వరదరాజులు, రఘుపతి, రాజన్, సుబ్రహ్మణ్యం, భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కంప్యూటర్ ప్రొఫెషియెన్సీ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి
- డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 27వ తేదీన కంప్యూటర్ ప్రొఫెషియెన్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు లోనికి తీసుకురాకూడదన్నారు. గ్రూప్–4 మెయిన్స్‌లో ఎంపికైన అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని డీఆర్వో తెలిపారు.

కచ్చితమైన ఓటరు జాబితాకు చర్యలు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా కచ్చితమైన ఓటరు జాబితాకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల పాత్ర ప్రముఖమన్నారు. ముఖ్య ఎన్నికల అధికారి పంపిన ఆన్‌లైన్ రిపోర్ట్ మేరకు పుంగనూరు నియోజకవర్గంలో 15 జూన్ 2023 నాటికి 862 ఓట్లు సున్నా డోర్ నంబర్‌తో నమోదైనట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలోని 261 పోలింగ్ కేంద్రాలను మాన్యువల్‌గా పరిశీలించినట్లు చెప్పారు. ఇందులో 10 జూలై 2023 నాటికి 717 మంది ఓటర్లను బీఎల్వోలతో పరిశీలించి, సరైన డోర్ నంబర్లను గుర్తించి ఫారం 8 ద్వారా ఓటర్ల డోర్ నంబర్లు నమోదు చేసినట్లు చెప్పారు. మిగిలిన 145 మంది ఓటర్ల సున్నా డోర్ నంబర్లను ఫారం 8 ద్వారా సరైన డోర్ నంబర్లను నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. బీఎల్వో యాప్‌లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల పరిశీలన కార్యక్రమం నెమ్మదిగా కొనసాగుతున్నట్లు చెప్పారు. సాంకేతిక లోపం ఉన్న సమాచారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో పరిష్కారం అవుతాయన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ బీఎల్వోలు వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. వెరిఫికేషన్ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన బీఎల్ఏలు హాజరుకావొచ్చన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో వలంటీర్ల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. కుప్పం నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం రుసుము చెల్లించి ఓటర్ల జాబితా వివరాలు తీసుకోవచ్చన్నారు. అనంతరం డీఆర్వో ఎస్.రాజశేఖర్, రాజకీయ నేతలతో కలసి కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌కు వెళ్లి వీవీ ప్యాడ్‌లను పరిశీలించారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలోని తేనెబండ వద్ద బుధవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారం మేరకు ఎస్‌ఈబీ అధికారులు తేనెబండ వద్ద దాడులు చేశారు. ఈ దాడుల్లో 96 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న పురుషోత్తం అనే వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శ్రీనాథరెడ్డి, నాగరాజులు, నాగరాజ, గౌతమ్ పాల్గొన్నారు.

అండర్-13 జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక రేపు

పలమనేరు: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నెల 28న పలమనేరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-13 జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి కిశోర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు కళ్యాణ్ 9542244261, మురళీధర్ 9502074146 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రగతి మణిహారం

ప్రగతికి ప్రతిరూపం రహదారులే. ఇదే సదాశయంతో రాష్ట్ర హైవేలు, జిల్లా రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందుకు పుష్కలంగా నిధులు కూడా కేటాయించింది. ఆయా దారుల అభివృద్ధి.. మరమ్మతులు, వంతెనల నిర్మాణంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.166.94 కోట్లతో పలు రోడ్లు బాగు చేయనుంది. ఇందుకు సంబంధించి టెండర్లను కూడా పిలిచింది.

444.03 కిలోమీటర్ల దూరం అభివృద్ధి

- రూ.166.94 కోట్లు నిధులు
- టెండర్లకు ఆహ్వానం

సాక్షి తిరుపతి/చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో రోడ్లు మరమ్మతు, అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన రాష్ట్ర హైవే రోడ్లు, మేజర్ డ్రిస్టిక్ రోడ్లను మరమ్మతు చేయనున్నారు. ఈ పనులకు నిధులు కేటాయించి టెండర్లను ఆహ్వానించారు.

స్టేట్ హైవే పనుల వివరాలివీ..

శ్రీకాళహస్తిలో పాపానాయుడుపేట-శ్రీకాళహస్తి రోడ్డు 21.75 కిలోమీటర్లు దూరం మరమ్మతుకు రూ.6.20 కోట్లు, చంద్రగిరిలో తిరుపతి-కొత్తపల్లెమిట్ట రోడ్డులో తిరుపతి నుంచి 7 కిలోమీటర్లు దూరం మరమ్మతుకు రూ.3.50 కోట్లు కేటాయించింది. అలాగే పీలేరు-భాకరాపేట వయా యలమంద దారి 21 కిలో మీటర్ల రూ.5 కోట్లు, అరకోణం-రేణిగుంట దారి రూ.1.20 కి.మీ రూ.2.20 కోట్లు, సత్యవేడులో పుత్తూరు-సత్యవేడు రోడ్డు 14.50 కి.మీ రూ.5 కోట్లు, తాడా-సత్యవేడు రోడ్డు 8 కి.మీ, రూ.4.50 కోట్లు, జీడీనెల్లూరులో కలువగుంట-నేంద్రగుంట వయా పెనుమూరు రోడ్డు 16 కి.మీ, రూ.5.50 కోట్లు, తిరుపతి-కొత్తపల్లెమిట్ట రోడ్డు 27.60 కి.మీ రూ.8 కోట్లు, పూతలపట్టులో చిత్తూరు-అరగొండ వయా పాటూరు రోడ్డు 6.80 కి.మీ, రూ.3 కోట్లు, పుంగనూరు పులిచెర్ల-చిన్నగొట్టిగల్లు రోడ్డు 6.80 కి.మీ, రూ.1.95 కోట్లు, తంబళ్లపల్లెలో ముడిపేడు-తంబళ్లపల్లె 23.20 కి.మీ. రూ.7.80 కోట్లు, మదనపల్లెలో మదనపల్లె-



యాదమరిలో మరమ్మతు చేయనున్న 184 గొల్లపల్లె దారి

చెబకూరు- రామసముద్రం రోడ్డు 19.74 కి.మీ, రూ.4.80 కోట్లు, మదనపల్లె-కందూరు వయా నిమ్మనపల్లె రోడ్డు 19 కి.మీ రూ.5 కోట్లు కేటాయించింది.

మేజర్ డ్రిస్టిక్ రోడ్ల వివరాలివీ...

చంద్రగిరిలో తిరుపతి-చంద్రగిరి రైల్వే ఫీడర్ రోడ్డు 3.53 కి.మీ, రూ.1.10 కోట్లు, దామలచెరువు-నేంద్రగుంట రోడ్డు 4.28 కి.మీ.రూ.1.70 కోట్లు, శ్రీకాళహస్తిలో ఆర్‌పీకే రోడ్డు - పాయల్ సెంటర్ వయా చెల్లూరు 5 కి.మీ రూ.1.20 కోట్లు, పూతలపట్టులో ఎంసీబీ రోడ్డు-పీజీ రోడ్డు వయా రాగిమానుపెంట, కీరమంద బండ్లదొడ్డి రోడ్డు 8.60 కి.మీ రూ.1.60 కోట్లు, సీకేటీ రోడ్డు-చిత్తూరు-ఐరాల రోడ్డు వయా వావిల్‌తోట, లక్ష్మయ్యవూరు 7 కి.మీ రూ.1.60 కోట్లు, సరకలు-మాధవరం రోడ్డు 10 కి.మీ రూ.2.40 కోట్లు, చిత్తూరు-అరగొండ రోడ్డు 5.60 కి.మీ రూ.1.85 కోట్లు, బంగారుపాళెం-అరగొండ రోడ్డు 1.60 కి.మీ రూ.75 లక్షలు, సీజీ రోడ్డు వయా తాళంబేడు, మాదిరెడ్డిపల్లె, 184 గొల్లపల్లె రోడ్డు 5.80 కి.మీ రూ.1.96 కోట్లు, ఉయ్యాలచింత-కీనాటంపల్లె రోడ్డు 4 కి.మీ రూ.92 లక్షలు, నగరిలో బుగ్గ అగ్రహారం-ఐలత్తూరు రోడ్డు 5 కి.మీ రూ.1.95 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అలాగే పూతలపట్టులోని సీకేటీ రోడ్డు-పీఎస్ రోడ్డు వయా పోలవరం, గొడుగుచింత 3 కి.మీ రూ. కోటి, చిత్తూరు-ఐరాల రోడ్డు తుమ్మలవారిపల్లె వయా మట్టిపల్లె, సీకేటీ రోడ్డు-ఎర్రేపల్లె, వయా కీలాపల్లె, గాండ్లపల్లె, 3 కి.మీ రూ.60 లక్షలు, జీడీనెల్లూరులో రాచపాళెం-వనదుర్గాపురం-బలిజకండ్రిగ 3.35 కి.మీ రూ.90 లక్షలు కేటాయించింది. చిత్తూరు-కడప-కర్నూలు వయా దొడ్డిపల్లె వేల్‌త్తూరు, చిత్తూరు-పుత్తూరు రోడ్డు వయా కోట్రకోన రోడ్డు ఎట్టేరి నుంచి, చిత్తూరు-పుత్తూరు రోడ్డు వయా దేవళంపేట, మారేడుపల్లె, వెజ్జుపల్లె, దామరగుంట 10.40 కి.మీ రూ.2.70 కోట్లు, జీడీనెల్లూరు-బలిజకండ్రిగ 8.65 కి.మీ రూ.3.20 కోట్లు, వీటితో పాటు ఏపీఆర్‌ఆర్‌పీ కింద జీడీనెల్లూరు నియోజకవర్గంలో47.31 కిలోమీటర్లను రూ.32.21 కోట్లతో రోడ్డును నిర్మించనున్నారు. చిత్తూరు-పుత్తూరు మార్గంలో ఉడమలకుర్తి వయా పిళ్లారి కుప్పం వద్ద 1.5 కి.మీ, రూ.27 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. రాచపాళెం-వనదుర్గాపురం నుంచి బలిజకండ్రిగ, హంసాపురం-టీపీఎస్‌ఆర్ పురం మార్గం మరమ్మతు కింద 28 కి.మీ, రూ.2.05 కోట్లతో పనులు చేయనున్నారు. కుప్పంలో కుప్పం-మల్లానూరు రోడ్డు వయా పైపాళెం, మోటలచేను 5.20 కి.మీ, రూ. కోటి, గడ్డూరు-కేకే బార్డర్ వయా కీనామాకులపల్లె, 121 పెద్దూరు 5.60 కి.మీ రూ.1 కోటి, గోవిందపల్లె, దండికుప్పం వయా శివరామాపురం 7.25 కి.మీ, రూ.1.65 కోట్లు కేటాయించింది. కుప్పం-గుడుపల్లెరోడ్డు-అగరం క్రాస్ 2.40 కి.మీ, రూ.కోటి పుంగనూరులో పుంగనూరు-కోలార్‌రోడ్డు యాటవాకిలి-పత్రాపల్లె రోడ్డుకు 8.21 కి.మీ రూ.1.60 కోట్లు, డీపీరోడ్డు-పీపీసీ రోడ్డు వయా బైరెడ్డిగారిపల్లె 7.24 కి.మీ రూ.1.50 కోట్లు, పలమనేరులో పలమనేరు-కుప్పం- తమిళనాడు బార్డర్ వరకు వయా కొలమాసనపల్లె, నేలిపట్ల, రంగంపేట 3 కి.మీ రూ.50 లక్షలు, మదనపల్లెలో మదనపల్లె-కృష్ణాగిరిరోడ్డు 3.24 కి.మీ, అనంతపురం-చెన్నై రోడ్డు 1.45కి.మీ, రూ.1.45 కోట్లు, పీలేరులో పొంతలచెరువు-తిమ్మాపురం రోడ్డు 20 కి.మీ రూ.6 కోట్లు, వాయల్పాడు-గుండ్లూరు 14.2 కి.మీ రూ.1.80 కోట్లు, తంబళ్లపల్లె బి.కొత్తకోట స్టేట్‌బార్డర్ రోడ్డు 8.3 కి.మీ రూ.1.30 కోట్లతో వేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో స్టేట్ హైవే 192.59 కి.మీ దూరం రూ.62.45 కోట్లతో, మేజర్ డ్రిస్టిక్ రోడ్లు, ఏపీఆర్‌ఆర్‌పీ, బ్రిడ్జి నిర్మాణానికి 247.71 కి.మీ రూ.104.49 కోట్లతో వేయనున్నారు.



హైలెవల్ వంతెన నిర్మించనున్న జీడీనెల్లూరులోని ఉడమలకుర్తి వద్ద ఉన్న వాగు



పలమనేరులో బాగు పడనున్న కొలమాసనపల్లె వయా నెల్లిపట్ల దారి

టెండర్లు పిలిచాం



జిల్లాలో రోడ్లు మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. ఈ మేరకు స్టేట్‌హైవే, మేజర్ డ్రిస్టిక్ రోడ్లు, లేయింగ్, మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండర్ దశ పూర్తయ్యాక రోడ్డు పనులు చేపడతాం. ఈ పనులు జరిగితే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

– ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఈ ఆర్‌అండ్‌బీ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రదీప్

చిత్తూరు కార్పొరేషన్: కుప్పం ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సహాయకులు ప్రదీప్‌ను నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై గత సబ్‌రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన 15 రోజులు సెలవుపై వెళ్లగా స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సహాయకురాలు భువనేశ్వరిని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆమె సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, రిజిస్ట్రేషన్లకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో ఆమెను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా తొలగించినట్లు సమాచారం.

వివాహిత అదృశ్యం



రోహిణి(ఫైల్)

పలమనేరు: పట్టణానికి చెందిన ఓ మహిళ కనిపించకుండా పోయిందని ఫిర్యాదు అందినట్లు పలమనేరు సీఐ చంద్రశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక పాతపేటకు చెందిన శంకర్ భార్య రోహిణి(23) ఈ నెల 23 నుంచి కనిపించడం లేదని, దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈమె ఆచూకీ తెలిస్తే పలమనేరు పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ తెలిపారు.

పకడ్బందీగా ఆరోగ్య సేవలు

చిత్తూరు రూరల్: వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆరోగ్య సేవలను పకడ్బందీగా అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం కొత్తగా నియమించిన వైద్యాధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రధానంగా గర్భిణులకు అందించే సేవలపై దృష్టి సారించాలన్నారు. మాతాశిశుమరణాల నివారణకు కృషి చేయాలన్నారు. అలాగే పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను విధిగా వేయించాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, అధికారులు శిరీష, రేణుక ప్రభ, గుణశేఖర్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో తేలియాడుతున్న సుధాకర్ మృతదేహం

గుడిపాల: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు గుడిపాల ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. గుడిపాల గ్రామానికి చెందిన సుధాకర్(48)అనే వ్యక్తి మంగళవారం గుడిపాలలోని పొలాల వద్ద ఉన్న బావిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. అతడికి ఈత రాకపోవడంతో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడడంతో మృతి చెందాడు. సుధాకర్‌ను ఎక్కడా వెతికినా కనిపించకపోవడంతో బుధవారం బావిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలియజేశారు. దీనికితోడు సుధాకర్‌కు అప్పుడప్పుడు ఫిట్స్ కూడా వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం జగన్‌కు భారతరత్న ఇవ్వాలి

- అంబేడ్కర్ పేరు చెప్పే అర్హత చంద్రబాబుకు లేదు
- నాడు బలహీన వర్గాల హక్కులను కాలరాసి, నేడు జపం చేస్తున్న బాబు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: 'బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేశారు.. పేదల తలరాతలను మార్చారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భారతరత్న బిరుదు ఇవ్వాలి' అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కోరారు. బుధవారం మండలంలోని నక్కలాంపల్లెలో ఉపముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. నాడు బడుగు బలహీన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన హక్కులను కాలరాసి, నేడు అధికారం కోసం దొంగ జపం చేస్తున్న చంద్రబాబుకు అంబేడ్కర్ పేరు ఎత్తే అర్హత ఎక్కడిదని ధ్వజమెత్తారు. ఉమ్మడిగా ఉన్న దళితులను ఓట్ల కోసం మాల, మాదిగలంటూ రాజ్యాంగ విరుద్ధంగా విడగొట్టి, ఎస్సీగా ఎవరైనా పుడతారా? అని అవమానపరచిన బాబు, నేడు పదవి కోసం వారిని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డాడు. విజయవాడలో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన దళితబాంధవుడన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశానవాటికలు ఏర్పాటుతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ఊరగాయలు అమ్ముకున్న రామోజీ నేడు రూ.లక్షల కోట్లు ఎక్కడి నుంచి దోచుకున్నారో ప్రజలకు తెలుసని అన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఎందుకు చంద్రబాబు, పవన్ అల్లాడిపోతున్నారో అర్థం కాలేదన్నారు. వీరికి పేదల బాగోగులు పట్టవన్నారు. పథకాలు అందకుండా చేయాలన్నదే రామోజీరావు, రాధాకృష్ణ, బాబు, పవన్ కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఎక్కడైనా పేదలకు ఇళ్లు ఇవ్వాలంటే వెంటనే టీడీపీ నాయకులు కోర్టులకెళ్లి స్టేలు తెచ్చి పేదలకు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నాడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గాలితో గెలిచిన వారు ఆయన్నే విమర్శిస్తున్నారని, అటువంటి వారి గురించి మాట్లాడుతానే తప్ప రెడ్డి సామాజిక వర్గంపై తనకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ఏ విధంగానైనా తప్పుడు ప్రచారాలు చేసి, ప్రజల్లో వ్యతిరేకత తీసుకురావడానికి ఎల్లో మీడియా నిత్యం అసత్యాలను వారి వద్దకు తీసుకెళుతోందని ఆరోపించారు. తాను ఏతప్పూ చేయపోయినా ఎల్లో మీడియా పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నట్లు మండిపడ్డారు. 'నా ఆత్మ సాక్షిగా పనిచేస్తున్నా.. నేను ఎవరికీ భయపడను.. నేను అవినీతి చేశానని నిరూపిస్తే నా పదవికి రాజీ నామా చేస్తా.. నిరూపించే దమ్ము ధైర్యం ఉందా' అని సవాల్ విసిరారు. పవన్‌పై కేసు పెడితే జైలు గోడలను పగులగొట్టాలని యువతను రెచ్చగొట్టడం, వివాదాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.

గొర్రెలపై వీధి కుక్కల దాడి



గొర్రెలకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు



మృతి చెందిన గొర్రెలు

- పది గొర్రెలు మృతి, మరో పది గొర్రెలకు తీవ్ర గాయాలు
- రూ.లక్ష ఆస్తి నష్టమని యజమాని ఆవేదన

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లెలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో వీధికుక్కలు గొర్రెల దొడ్డిలోనికి చొరబడి 10 గొర్రెలను చంపివేసి, మరో 10 గొర్రెలు కొరికి, తీవ్రంగా గాయపరిచాయి. మిగిలిన 20 గొర్రెలు పాక్షికంగా గాయపడినట్లు యజమాని కోటకొండ కృష్ణప్ప తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. వడ్డిపల్లెకు చెందిన కోటకొండ కృష్ణప్ప 40 గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే మంగళవారం సాయంత్రం గొర్రెలను దొడ్డిలో ఉంచాడు. బుధవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో వీధి కుక్కలు దొడ్డిలోకి చొరబడి, వాటిపై దాడి చేశారు. ఈ ఘటనలో పది గొర్రెలు మృతి చెందాయి. మరో పది గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వాటికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. గొర్రెల మృతితో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం కలిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న పశుసంవర్థక శాఖ ఏడీ శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారి చందనప్రియ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు.

ఎండీయూ ఆపరేటర్లకు 'మిత్ర' సాయం


తిరుపతి కల్చరల్: ఎండీయూ ఆపరేటర్లకు వాహనమిత్ర నగదు అందించడంతోపాటు వేతన బకాయిలను వెంటనే విడుదల చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం ఈ మేరకు ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కోవిడ్‌తో మరణించిన 58 మంది ఆపరేటర్లకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రేర్ ఎర్త్ టెక్నాలజీతో క్యాన్సర్‌కు చెక్

తిరుపతి సిటీ : రేర్ ఎర్త్ సైన్స్ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ మూలాను గుర్తించి నివారించవచ్చని ఆర్‌ఈఏఐ సెక్రటరీ, సైంటిస్ట్ డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి తెలిపారు. బుధవారం పద్మావతి మహిళా వర్సిటీ సావేరి అతిథిగృహంలో భౌతిక శాస్త్ర విభాగం, రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేర్ ఎర్త్ టెక్నాలజీ ద్వారా మానవుని శరీరంలోని క్యాన్సర్ కణాలను గుర్తించి వివిధ ఎక్స్‌రే కిరణాలతో నిర్మూలించవచ్చని వివరించారు. విద్యార్థులు ఈ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని పరిశోధనలు చేయాలని సూచించారు. వాతావరణంలోని మార్పులను ముందుగానే తెలుసుకొనేందుకు రేర్ ఎర్త్ సైన్స్ టెక్నాలజీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వర్సిటీ వీసీ డి.భారతి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని ఔపోసన పట్టి పరిశోధనాపరంగా ముందుకు సాగాలన్నారు. ఆర్‌ఈఏఐ ఉపాధ్యక్షుడు ఆచార్య సీకే జయశంకర్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రేర్ ఎర్త్ పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగకరని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య బి. దేవ ప్రసాద్ రాజు, కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.కృష్ణయ్య, భౌతిక శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఎ. శ్రీదేవి, ఆచార్య కె. సుబ్రమణ్యంరెడ్డి, మంజునాథ్, సౌమ్య, మయూరి, వరలక్ష్మి, హిమగిరీష్ కుమార్, బాసమ్మ రజిత, సంధ్య పాల్గొన్నారు.

యోగా.. ఆరోగ్య దిక్సూచి

- సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ షణ్మోహన్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : యోగా ఆరోగ్య దిక్సూచి అని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాలో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన కలెక్టర్‌కు ఆ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగా అంటే వ్యాయామ సమాహారాల ఆధ్యాత్మిక రూపమని చెప్పారు. యోగాసనాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రతి రోజూ యోగా సాధనతో పదిహేను అద్భుత ఆరోగ్య లాభాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ తమ కళాశాలలో 2022-23 బ్యాచ్‌లో యోగా డిప్లొమా కోర్సును 20 మంది విద్యార్థులు పూర్తి చేశారన్నారు. ఏడాది పాటు నిర్వహించే యోగా డిప్లొమా కోర్సులో రెండు సెమిస్టర్లు ఉంటాయని చెప్పారు. పీవీకేఎన్ కళాశాలలో ఈ కోర్సు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికీ రెండు బ్యాచ్‌లు పూర్తి అయినట్లు తెలిపారు. మూడో బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జీవన గమనాన్ని మార్చే దివ్య ఔషధం యోగాకు ఉన్నట్లు తెలిపారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా కో ఆర్డినేటర్ మోహన్‌బెహ్రా, అధ్యాపకులు మీరాసాహెబ్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.